# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **వివిధ రంగాల్లో ప్రభుత్వ జోక్యాన్ని మరింత తగ్గించడానికి వీలుగా డీ రెగ్యులేషన్ కమిషన్‌ను నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు.**

**2.** **పేదరికం, అసమానతలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.**

**3.** **తెలంగాణాలో జరిగిన కులగణన సర్వేలో గతంలో పాల్గొనని వారు వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ రోజు నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది.**

**4.** **రాష్ట్రంలో పచ్చి మిర్చి, ఎండు మిర్చి సహా కూరగాయల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.**

**5.** **మహిళలు, చిన్నారులు, వృద్ధులపై నేరాల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు.**

===========================

వివిధ రంగాల్లో ప్రభుత్వ జోక్యాన్ని మరింత తగ్గించడానికి వీలుగా డీ రెగ్యులేషన్ కమిషన్‌ను నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. ఢిల్లీలో నిన్న జరిగిన ప్రపంచ వాణిజ్య సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాలంచెల్లిన అనేక నిబంధనలను ఇప్పటికే తొలగించామని, ఇప్పుడు జన్ విశ్వాస్ 2.0 ద్వారా సులభతర వాణిజ్య నిర్వహణను ప్రోత్సహించేలా మరిన్ని చర్యలు చేపడుతున్నామని నరేంద్ర మోదీ చెప్పారు. నాలుగోతరం పారిశ్రామిక విప్లవంలో మనదేశం చురుకైన పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

---------------------------

పేదరికం, అసమానతలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ 28 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తలసీమియా బాధితుల సహాయం కోసం విజయవాడ ఇందిరాగాంధీ పురపాలక మైదానంలో నిన్న రాత్రి యుఫోరియా సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా

చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ.. సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలని కోరారు. సంపాదనలో కొంతభాగం సేవా కార్యక్రమాలకు వెచ్చించి జీవితాలను సార్థకం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచిస్తూ..

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

తెలంగాణాలో జరిగిన కులగణన సర్వేలో గతంలో వివరాలు ఇవ్వనివారికి ఈరోజు నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. తొలిదశ సర్వేలో 3 లక్షల 56 వేల 323 కుటుంబాలు తమ వివరాలను నమోదు చేయలేదని.. వీరికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు ప్రణాళికశాఖ తెలిపింది. seeepcsurvey.cgg.gov.in అనే వెబ్‌సైట్ నుంచి సర్వే దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకుని వివరాలు నింపి కుటుంబ యజమాని సంతకం చేసి సమీపంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో అందజేయాలని సూచించింది. నేరుగా మండల అభివృద్ధి అధికారి కార్యాలయం లేదా పట్టణాల్లోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో ఉండే ప్రజాపాలన సేవా కేంద్రానికి వెళ్లినా అక్కడ వివరాలు నమోదు చేస్తారు. ఈ రెండూ చేయలేని వారు 040 21111111 రుసుము రహిత నంబరుకు ఉదయం 9 నుంచి సాయంకాలం 5 గంటల మధ్య ఫోన్ చేస్తే గణకులే ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని ప్రణాళిక శాఖ తెలిపింది.

---------------------------

రాష్ట్రంలో పచ్చి మిర్చి, ఎండు మిర్చి సహా కూరగాయల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రైతులు గిట్టు బాటు ధరల్లేక ఇబ్బందులు పడకూడదని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్న భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూరగాయలు, ఇతర పంటల ధరల పర్యవేక్షణపై విజయవాడలోని క్యాంపు కార్యా లయం నుంచి నిన్న ఆయన వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాలు, మార్క్ ఫెడ్ శాఖల అధికారులతో దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చేయటంతో పాటు వినియోగదారులకు కూడా కనీస ధరలకు ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చూడాలని విజయానంద్ అధికారులను ఆదేశించారు.

---------------------------

మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే నేరాల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. నేరస్థుల నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా సత్వర స్పందన దళాలు సిద్ధం చేస్తున్నామని నిన్న ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇటీవల హేయమైన నేరాలకు పాల్పడ్డవారికి జీవితఖైదు లేదా మరణశిక్ష విధించేలా పోలీసు శాఖ పరంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని డీజీపీ వివరించారు.

---------------------------

తెలంగాణాలో శాసనమండలి ఎన్నికల కోడ్ లేని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సచివాలయంలో నిన్న ఆయన రెవెన్యూ, గృహ, సమాచార-ప్రసార శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపా దనలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్‌లో యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒంగోలు సమీపంలోని వల్లూరులో ఒక ఇంజనీరింగ్ కళాశాలలో నిన్న నిర్వహించిన ప్రకాశం జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో పట్టణంలోని వివిధ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పంచ్ ప్రాణ్ స్ఫూర్తితో నిర్వహించిన ఈ యువ ఉత్సవ్‌లో ఆరు అంశాల్లో యువత తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు ఆకాశవాణితో మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల వల్ల తమ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందని తెలిపారు. యువతను ప్రోత్సహించడానికి యువ ఉత్సవాలు ఎంతో దోహదం చేస్తాయని డిగ్రీ విద్యార్థిని గాయత్రి వివరిస్తూ..

...వాయిస్ ..25 సెకన్లు

-------------------------

దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి పన్నుల చెల్లింపు ప్రధానమని ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా తెలిపారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర.ఎ.పాటిల్‌తో కలసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు 11 వేల 480 కోట్ల రూపాయల వసూళ్లు సాధించి లక్ష్యానికి చేరువలో ఉన్నామని తెలిపారు. తలసేమియా బాధితుల కోసం రాష్ట్రంలో 52 ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 4 వేల 59 యూనిట్ల రక్తాన్ని సేకరించామని సాధు నరసింహారెడ్డి చెప్పారు.

-------------------------

కోళ్ల పారాల్లో అపరిశుభ్ర వాతావరణమే బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తికి కారణమవుతోందని ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరులో వైరస్ వ్యాప్తి చెందిన కోళ్ల ఫారాలను కలెక్టర్ నాగరాణితో కలిసి నిన్న ఆయన పరిశీలించారు. అంతకుముందు పౌల్ట్రీ రైతులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లోని 5 ఫారాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్లు మృత్యువాత పడ్డాయని రాజశేఖర్ తెలిపారు. ఆయా ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించి, 10 కిలోమీటర్ల పరిధిలో మాంసం, కోడిగుడ్ల విక్రయాలను నిషేధించామని చెప్పారు.

-------------------------

ఢిల్లీలో నిర్వహించిన భారత్ టెక్స్-2025లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ పెట్టుబడిదారుల్ని, పరిశ్రమ ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి మండలి ప్రతినిధులు పెట్టుబడిదారులతో చర్చలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నూతన జౌళి విధానం గురించి రేఖారాణి తెలియజేశారు. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు సమగ్ర మౌలిక సదుపాయాలనూ ప్రభుత్వమే కల్పిస్తుందని ఆమె తెలిపారు. ఈ క్రమంలోనే కర్ణాటకకు చెందిన పెట్టుబడిదారులు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేసేందుకు చర్చలు జరిపారు.

====================